



చెదిరిన చెరువు



ఆక్రమణలో జుర్రేరు వాగు

బనగానపల్లె, జూన్ 2:
బనగానపల్లె డివిజన్‌లో చెరువులు, వాగులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇందులో అత్యధికంగా పట్టణ సమీపంలోని రాచెరువు, జుర్రేరు వాగు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కబ్జా పర్వం సాగుతున్నా మైనర్ ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలు లేవు. చివరకు మైనర్ ఇరిగేషన్ అధికారులనే ఆక్రమణదారులు బెదిరిస్తున్నారు. దీంతో అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు రాచెరువు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఇచ్చారు. ఇదే అదనుగా మిగిలిన భూమిని మరికొందరు దర్జాగా ఆక్రమించేశారు.

- రాచెరువు మొత్తం కబ్జానే..
- ఆక్రమణలో వాగులు వంకలు
- జుర్రేరు వాగు ఇరువైపులా నిర్మాణాలు
- సమన్వయం లేని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు
- అడ్డూ అదుపులేని అక్రమార్కుల కబ్జాలు

కబ్జాకు గురైన రాచెరువు

బనగానపల్లె మండలంలోని రాచెరువు కబ్జాకు గురైంది. ఈ చెరువు వంద ఎకరాల్లో ఏర్పాటు కాగా ప్రస్తుతం మొత్తం కబ్జాకు గురైంది. రాచెరువు విస్తీర్ణం వంద ఎకరాలు కాగా 99, 100, 101, 102, 103 సర్వే నంబర్లలో చెరువు ఉంది. సర్వే నంబర్ 99, 102, 103లో చెరువు కట్ట ఉంది. 1977లో అప్పటి రెవెన్యూ అధికారులు చెరువులోని 40 ఎకరాలు 40 మందికి పట్టాలు నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేశారు. మిగిలిన చెరువు స్థలం కూడా కబ్జాదారుల చేతిల్లోకి వెళ్లిపోయింది. గతంలో ఆక్రమణదారులకు మైనర్ ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారులు తాము పొలాలను సాగు చేసుకుంటున్నామని, మైనర్ ఇరిగేషన్ శాఖాధికారులపైనే బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు తమకెందుకులే అని పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు చెరువు భూములను పూర్తిగా ఆక్రమించేశారు. మండలంలోని తమ్మడపల్లె సమీపంలోని తమ్మడపల్లె చెరువు విస్తీర్ణం వంద ఎకరాలు కాగా 48 ఎకరాల వరకు ఆక్రమించారు.

వర్షాభావ పరిస్థితులే కారణం

మండలంలో దద్దనాల చెరువు, కుక్కలగుంటి చెరువు, పసుపుల చెరువు, మద్దిలేటయ్య స్ప్రింగ్ చానల్, అక్కాజమ్మ చెరువు, రామతీర్థం చెరువు, ఇల్లూరుకొత్తపేట స్ప్రింగ్ చానల్‌లు ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువుల్లోకి సరిగా నీరు రాకపోవడంతో ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. అలాగే అవుకు మండలంలోని వేములపాడు చెరువు, మెట్టుపల్లె చెరువు, శింగనపల్లె, సంగపట్నం చెరువులు కొంతమేర ఆక్రమణకు గురయ్యాయి. కొన్ని చెరువులకు వంకలు, కాలువల ద్వారా నీరు చేరుతోంది. వంకలు, వాగులను సైతం అక్రమార్కులు ఆక్రమించేయడంతో ఆ పరిస్థితి కూడా లేకుండాపోయింది.



ఆక్రమణకు గురైన రాచెరువు

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలి

రాచెరువును సమ్మర్ స్టోరేజీగా మార్చాల్సిన అవసరం ఉంది. కబ్జాల నుంచి రాచెరువును కాపాడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది. వంద ఎకరాలు గల రాచెరువుకు ఎస్సార్బీసీ, లేదా గాలేరు నగరి ద్వారా ఎత్తిపోతల ద్వారా సులభంగా నీరందించవచ్చు. రాచెరువులో నీరు ఉంటే బనగానపల్లె, బత్తులూరుపాడు, యనకండ్ల, మీరాపురం, యాగంటిపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్లలో పుష్కలంగా నీరు ఉండి ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుంది. బనగానపల్లె పట్టణ సమీపంలో ఉన్న రాచెర్వు వద్ద సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్య తీరుతుంది. భూగర్భ జలాలు పెరుగతాయి. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రాచెరువుతో పాటు పలు చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆక్రమణలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జుర్రేరు వాగు ఆక్రమణ

పట్టణంలోని జుర్రేరు వాగును కొందరు ఆక్రమించేశారు. బనగానపల్లె పట్టణంలో జుర్రేరు వాగుకు ఇరువైపుల భవనాలను నిర్మించుకున్నారు. కొందరు పంటలు పండించుకుంటున్నారు. జుర్రేరు ఆక్రమణలను తొలగించాలని అప్పటి జిల్లా కలెక్టర్ విజయమోహన్ బనగానపల్లె తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సర్వే చేయకపోవడంతో నేటికీ జుర్రేరు వాగు ఆక్రమణలోనే ఉంది.

సహకరించని రెవెన్యూ అధికారులు

రెవెన్యూ అధికారులు సహకరిస్తే రాచెరువు, తమ్మడపల్లె చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నా రెవెన్యూ అధికారులు సహకరించడం లేదని మైనర్ ఇరిగేషన్ అధికారులు వాపోతున్నారు. రాచెరువులో రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది. అయితే రెవెన్యూ అధికారులు ఆ వైపుగా చర్యలు తీసుకోవడం లేదు.

చెరువును ఆక్రమించి సాగు చేసిన జొన్న పంట



రైతన్నకు చల్లని కబురు

- వేగంగా కదులుతున్న నైరుతి రుతుపవనాలు
- నేడో, రేపో రాయలసీమను తాకే అవకాశం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో రైతన్నలకు చల్లని కబురు మోసుకొచ్చాయి. ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు ఇప్పటికే దేశంలోని కేరళలో ప్రవేశించి, భారీ వర్షాలు కురుస్తుండగా, రేపు లేదా ఎల్లుండి మన రాష్ట్రంలోని రాయలసీమలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో, భూగర్భ జలాలు అడుగంటి, దిక్కుతోచని పరిస్థితుల్లో వున్న రైతులు, వివిధ వర్గాల ప్రజలకు, అనుకున్న సమయంలోనే నైరుతి రుతుపవనాలు మన దరికి చేరడం సంతోషాన్ని కలిగిస్తోంది. గత ఏడాది నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల ప్రజలకు చేదు అనుభవాన్ని మిగిల్చాయి. దీంతో సంవత్సర కాలంగా సరైన వర్షాలు లేక అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈఏడాది నైరుతి రుతుపవనాల కారణంగా జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. ఏపీలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ రుతుపవనాల విస్తరణకు ఇవేవి అడ్డుకావని వాతావరణ శాఖ ప్రకటించింది. రేపో ఎల్లుండో రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం వుండటంతో ముందుగా చిరు జల్లులు, ఓ మోస్తరు వర్షాలు ప్రారంభమై నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని అంచనా వేస్తున్నారు. దీంతో జిల్లాలో ఎండల తీవ్రత, ఉక్కపోత నుండి కూడా ప్రజలకు ఉపశమనం లభించనుంది. అనుకున్న సమయానికి వర్షాలు కురిస్తే జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు పూర్తి స్థాయిలో జరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 3లక్షల హెక్టార్లకు పైబడి వుంటుందని అధికారుల అంచనా. ఖరీఫ్‌లో రైతులు అధికంగా సాగుచేసే పంటలు మొక్కజొన్న, జొన్న, ఆముదం, ఉల్లి, మిరప, పత్తి, వరి తదితర పంటలను సాగు చేస్తారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే జూన్-15 తర్వాత రైతన్నలు పెద్ద ఎత్తున పంటల సాగుకు సమాయత్తం అవుతారు. అయితే అన్నదాతల చేయూత కోసం ఎరువులు, విత్తనాలు అందుబాటులో వుంచాలని పలువురు కోరుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాసులు


పాణ్యం, జూన్ 2: లెక్కింపు కేంద్రాల్లోని పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాలలోని ఎన్నికల కమిషన్ సూచించిన మేరకు పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లను వెంటనే పూర్తి చేసుకొని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకంతా సిబ్బంది మొత్తం కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో రౌండ్ల వారిగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల లెక్కింపు ఫలితాలను వెంటనే కమ్యూనికేషన్ సెంటర్‌కు చేరవేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు తగ్గించి అవసరం ఉన్న వారికే కౌంటింగ్ ఏజెంట్ పాసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏజెంట్లు అవాంతరాలను సృష్టించినా, ఇబ్బందులు కలిగించినా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించి బయటికి పంపివేయాలని అన్నారు. సాయంత్రం 5 గంటలలోపు ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ, నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆళ్లగడ్డ, డోన్, బనగానపల్లె, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లికారున్ రెడ్డి,, మహేశ్వరరెడ్డి, కామేశ్వరరావు, దాసు పాల్గొన్నారు.

ఇక 24 గంటలే..

- కౌంటింగ్‌కు సమీపిస్తున్న సమయం
- ఏజెంట్లను సిద్ధం చేసుకున్న అభ్యర్థులు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!

ఆత్మకూరు, జూన్ 2: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో అందరి దృష్టి ఓట్ల లెక్కింపుపై పడింది. ఏపీలో మే 13వ తేదీన 4వ విడతలో ఎన్నికలు ముగియడంతో ఫలితాల కోసం సుమారు 21 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఓట్ల లెక్కింపునకు మరో 24 గంటలు మాత్రమే మిగలడంతో అభ్యర్థులతోపాటు ప్రధాన పార్టీల శ్రేణుల్లో టెన్షన్ పెరిగిపోతోంది. పార్లమెంట్, నియోజకవర్గాల స్థాయిల్లో ఎవరు విజయబావుటా ఎగురవేస్తారన్న ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో రాష్ట్రంలో కూటమే అధికారంలో వస్తోందని చెప్పినప్పటికీ ఇంకా అదే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుపై టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల ముందు చాలా సర్వేల్లో శ్రీశైలంలో టీడీపీ గెలుస్తుందని వెల్లడైంది. అయితే ఎన్నికల్లో వైసీపీ ఓటుకు రూ.2 వేలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఓటర్లు డబ్బు ప్రలోభాలకు గురయ్యారా..? అన్నది టీడీపీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. అదే క్రమంలో వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత, టీడీపీ మేనిఫెస్టోపై ప్రజల్లో ఆదరణ ఉందని, గెలుపు తథ్యమన్న భావన టీడీపీ నాయకుల్లో లేకపోలేదు. పైగా ఓటింగ్ శాతం అధికంగా నమోదు కావడంతో తమకే లబ్ధి జరుగుతోందని వారు భావిస్తున్నారు. అయితే శ్రీశైల మల్లన్న ఆశీస్సులు ఎవరికి అన్నది మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో స్పష్టం కానుంది.





బుడ్డా రాజశేఖరరెడ్డి



శిల్పా చక్రపాణిరెడ్డి

కౌంటింగ్ ఏజెంట్లను సిద్ధం చేసుకున్న అభ్యర్థులు

నంద్యాలలోని ఆర్‌జీఎం కళాశాలలో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపునకు అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను సిద్ధం చేసుకున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో పోలైన ఓట్లను 23 రౌండ్లలో లెక్కిస్తారు. ప్రతి రౌండ్‌కు పది టేబుళ్ల చొప్పున ఈవీఎంల కంట్రోల్ యూనిట్ల ద్వారా ఓట్ల లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు ఆయా పార్టీల తరఫున ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు మరో నాలుగు టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకున్నారు. అలాగే ప్రతి అభ్యర్థి తరఫున చీఫ్ ఏజెంట్లను కూడా నియమించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే కౌంటింగ్ ఏజెంట్లు హాజరు కావాలి. వీరు సోమవారం సాయంత్రానికే నంద్యాలకు చేరుకొని లాడ్జిలను బుక్ చేసుకున్నారు. ఇదిలావుంటే ఇప్పటికే ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లను అన్ని జాగ్రత్తలను తెలియజేశారు. ప్రత్యేకించి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కూడా ఇచ్చారు.

మే 13 నాటి పోలింగ్ వివరాలు

శ్రీశైల నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల్లోని 226 పోలింగ్ కేంద్రాల్లో 1,96,116 ఓట్లు ఉన్నాయి. 1,62,760 ఓట్లు పోలయ్యాయి.

అక్రమ నర్సరీలు

- యథేచ్ఛగా విక్రయానికి నాసిరకం నారు
- గగ్గోలు పెడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



అనుమతిలేని బావిపల్లి నర్సరీలో సాగు చేసిన టమోటా, మిరప నారు

ప్యాపిలి, జూన్ 2: మండలంలో అక్రమ నర్సరీలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఈ నర్సరీలలో నాసిరకం మొక్కలు(నారు) విక్రయిస్తూ వ్యాపారులు రైతులను ముంచుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ప్యాపిలి, బావిపల్లి, వెంగళాంపల్లి, పీఆర్‌పల్లి, చిగురుమాను మిట్ట తదితర గ్రామాల్లో దాదాపు 40 అక్రమ నర్సరీలు వెలిశాయి. ఇక్కడి రైతులు గత 15ఏళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్‌లలో టమోట, మిరప పంటల సాగు చేస్తున్నారు. ఏటా దాదాపు 10 వేల ఎకరాల్లో ఈ పంటలను సాగుచేస్తున్నారు.



పీఆర్ పల్లిలో వెలసిన అక్రమ నర్సరీ

దీంతో ప్యాపిలి మండలంతో పాటు కడప, అనంతపురం ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి అక్రమ నర్సరీల వ్యాపారానికి తెర లేపినట్లు విమర్శలు ఉన్నాయి. ఏటా రూ.లక్షల్లో వ్యాపారం సాగిస్తూ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి

నిబంధనల ప్రకారం నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే ఇక్కడి వ్యాపారులు అనుమతులు తీసుకోకుండానే నర్సరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నర్సరీలలో నాసిరకం టమోట, మిరప తదితర మొక్కలను విక్రయిస్తూ వ్యాపారులు రైతులను దగా చేస్తున్నట్లు ఆరోణలు గుప్పుమంటున్నాయి. దీంతో రైతులు ఏటా ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలుస్తోంది. అధికారులు స్పందించి అక్రమ నర్సరీలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ నర్సరీలను ఉపేక్షించం

అక్రమ నర్సరీలను ఉపేక్షించం. ప్రభుత్వ అనుమతి లేని నర్సరీ వ్యాపారులకు నోటీసులు పంపాం. త్వరలో వారు రుసుము చెల్లించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. నాసి రకం మొక్కలను విక్రయిస్తున్న నర్సరీల లైసెన్స్‌లను రద్దు చేస్తాం.

-కళ్యాణి, ఉద్యానశాఖ అధికారి

పెట్నికోటలో పర్యటించిన ఎస్పీ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: ఇటీవల పోలింగ్ సందర్భంగా ఘర్షణ తలెత్తిన పెట్నికోట గ్రామాన్ని నంద్యాల ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. గ్రామంలో కొనసాగుతున్న పోలీసు పికెట్‌ను పరిశీలించి, ఘర్షణల నివారణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి సీఐ గోపినాథ్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఏజంట్లు, అభ్యర్థులు మినహా ఎవ్వరూ కౌంటింగ్ కేంద్రాలకు రాకుండా స్థానిక పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ గోపినాథ్ రెడ్డి, ఎస్పీ ఎస్‌ఐ హరినాథరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



పెట్నికోటలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆకస్మిక తనిఖీ

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలో ఎన్నికల కౌంటింగ్ సందర్భం గా రెండు రోజులుగా వివిధ కూడళ్లలో నిర్వహిస్తున్న పోలీస్ పికెట్‌ను ఆదివారం ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పోలీస్ పికెట్‌లను తనిఖీ చేసి పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుం డా జాగ్రత్తగా ఉండాలని పికెట్ సిబ్బందిని ఆదేశించారు. విజయోత్సవ ర్యాలీలు జరగకుండా, టపాసులు పేల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు.



టెన్షన్.. టెన్షన్...!

- రేపు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- ఓటర్లు ఇచ్చిన తీర్పు ఎలా ఉంటుందో..?
- ఎగ్జిట్ పోల్స్ వచ్చినా వీడని ఉత్కంఠ
- నిద్రలేని రాత్రులు గడుపుతున్న బెట్టింగ్‌రాయుళ్లు

కర్నూలు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల సుదీర్ఘ ప్రక్రియకు మంగళవారంతో తెర పడనుంది. రాష్ట్రంలో మే 13న ఓటర్లు తీర్పు ఇచ్చారు. ఈవీఎం యంత్రాల్లో అభ్యర్థులు భవితవ్యం నిక్షిప్తమై ఉంది. ప్రజల తీర్పు ఎలా ఉంటుందోనన్న ఆందోళన అభ్యర్థుల్లో మరింత ఎక్కువైంది. పోలింగ్ తరువాత కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలకు వెళ్లిన వారు కొందరైతే.. విహార యాత్రలకు వెళ్లిన వారు కొందరు. మరికొందరు తమ వ్యాపార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. ఓట్ల లెక్కింపునకు మరికొన్ని గంటలే సమయం ఉండడంతో అభ్యర్థులు ఏజెంట్లకు శిక్షణ, అవగాహన కల్పిస్తూనే.. గ్రామాల వారిగా వచ్చిన పోలైన ఓట్ల వివరాలతో అంచనాలు వేస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే విజయ అవకాశాలు ఉన్నట్టు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. కొన్ని వైసీపీకి అనుకూలంగా చెప్పడం వల్ల ఆ పార్టీ నేతల్లోనూ జోష్ నెలకొంది. మరో పక్క రూ.లక్షలకు రూ.లక్షలు పందెం పెట్టిన బెట్టింగ్‌రాయుళ్లు మాత్రం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎంపీ అభ్యర్థులుగా టీడీపీ కురువ, వైసీపీ వాల్మీకి సామాజికవర్గాల అభ్యర్థులను బరిలో దింపడంతో పలు నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతోంది.

జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానం సహా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 121 మంది బరిలో ఉన్నారు. టీడీపీ కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్య పోరు సాగింది. ఏపీ పీసీసీ సారధ్య బాధ్యతలు వైఎస్ షర్మిల చేపట్టడంతో కాంగ్రెస్ అభ్యర్థులు మేము సైతం అంటూ ఉనికి చాటుకోవడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు నుంచి పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేశారు. ఒక్కో నియోజకవర్గంలో దాదాపు రూ.50-60 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అనధికారిక సమాచారం. మే 13న ఓటర్లు ఇచ్చిన తీర్పు ఈవీఎంలో నిక్షిప్తమై ఉంది. పోలింగ్ తర్వాత వేసవి విడిది, విహార యాత్రలు, తీర్థయాత్రలకు దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రముఖులు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్నారు. ఓట్ల లెక్కింపు కోసం అధికార యంత్రాంగం ఓ వైపు కసరత్తు చేస్తోంది. మరో వైపు ఎగ్జిట్ పోల్స్ సర్వేల అంచనాలు, క్రాస్ ఓటింగ్ తీరుపై అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మాత్రం అధికార పార్టీ వైసీపీకే ఎక్కువ సీట్లు వచ్చేలా ఉన్నాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే ఉమ్మడి జిల్లాలో 1994, 1999 ఎన్నికల తరహాలో మెజార్టీ స్థానాలు టీడీపీ కూటమి దక్కించుకుంటుందని ఆ పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.



నిద్రలేని రాత్రులు

రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుంది.. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు..? అంటూ జిల్లాలో రూ.కోట్లలో బెట్టింగ్ జరిగింది. శనివారం ఎగ్జిట్ పోల్స్ వచ్చాక కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని పెద్దఎత్తున బెట్టింగ్ పెట్టారు. ఆదోని మండలం బస్సాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆధ్వర్యంలో ఐదారుగురు కలిసి రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని దాదాపు రూ.కోటికి పైగా పందెం కాశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి గెలుస్తారని పెద్ద ఎత్తున బెట్టింగ్ పెట్టారు. మంత్రాలయం నియోజకవర్గంలో బహిరంగ చాలెంజ్‌కు దిగారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో బెట్టింగ్ జోరు సాగింది. ఎక్కువ శాతం రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ప్రభుత్వంపైనే పందేలు పెట్టారు. మంగళవారం ఓటర్లు తీర్పు వెలువడనుండడంతో బెట్టింగ్ రాయుళ్ల నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

క్రాస్ ఓటింగ్ భయం

జిల్లాలో పలు నియోజకవర్గాల్లో క్రాస్ ఓటింగ్ భయం అభ్యర్థులను వెంటాడుతోంది. కర్నూలు ఎంపీ అభ్యర్థులుగా కురవ సామాజిక వర్గానికి చెందిన బస్తిపాటి నాగరాజును టీడీపీ బరిలో దింపితే.. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన కర్నూలు మేయర్ బీవై రామయ్యను వైసీపీ పోటీలో నిలిపింది. పలు నియోజకవర్గాల్లో ఈ రెండు సామాజికవర్గాలు అభ్యర్థుల గెలుపోటములు నిర్దేశించే స్థాయిలో ఉండడమే క్రాస్ ఓటింగ్ భయానికి ప్రధాన కారణం. పత్తికొండ నియోజకవర్గంలో కురవ సామాజికవర్గం ఓటర్లు బలంగా ఉన్నారు. అయితే కురువలు పార్టీలకతీతంగా బస్తిపాటి నాగరాజును గెలుపించుకోవాలని ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వైసీపీకి చెందిన కురువలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు క్రాస్ ఓటింగ్ వేసి ఉంటారన్న భయం వైసీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను వెంటాడుతోంది. ఆదోనిలో కూటమి తరుపున బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారధి పోటీ చేశారు. ఈయన వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వైసీపీకి చెందిన వాల్మీకులు, ఎమ్మెల్యేకు బీజేపీ అభ్యర్థి పార్థసారథికి, ఎంపీకి వచ్చే సరికి వైసీపీ అభ్యర్థి బీవై రామయ్యకు క్రాస్ ఓటింగ్ వేశారని వైసీపీ సాయిప్రసాద్‌రెడ్డి ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. అదే క్రమంలో మంత్రాలయం నియోజకవర్గం నుంచి వాల్మీకి సామాజికవర్గానికి చెందిన మాధవరం రాఘవేంద్రరెడ్డిని టీడీపీ బరిలో దింపింది. ఈ నియోజకవర్గంలో ఆ సామాజికవర్గం ఓటర్లే 85 వేలకు పైగా ఉన్నారు. పార్టీలకు అతీతంగా వాల్మీకి అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని గెలిపించుకోవాలని వాల్మీకి యువత విస్తృతంగా ప్రచారం చేసింది. వాల్మీకి సామాజికవర్గంలో కూడా ఎమ్మెల్యే ఓటు టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డికి, ఎంపీ ఓటు వైసీపీ అభ్యర్థి బీవై రామయ్యకు వేశారని తెలుస్తోంది. దీంతో వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి, ఆయన అనుచరగణాన్ని క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతోంది. అలాగే.. ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, కోడుమూరు నియోజకవర్గాల్లో వైసీపీకి చెందిన కురవలు ఎంపీ ఓటు బస్తిపాటి నాగరాజుకు క్రాస్ ఓటు వేశారని, అదే క్రమంలో టీడీపీలో ఉంటున్న వాల్మీకులు కూడా కొందరు ఎంపీకి బీవై రామయ్యకు క్రాస్ ఓటింగ్ వేసినట్లు తెలుస్తోంది.



కాంట్రాక్టర్లకు కాసుల వర్షం

రైతు బజార్లలో నాసిరకంగా పనులు

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: రైతులు పంట ఉత్పత్తుల విక్రయం ద్వారా వ్యాపారుల నుంచి వసూలైన సెస్సు ఆదాయం ఎంతో పొదుపుగా నాణ్యమైన పనులకు వెచ్చించాలి. అయితే చాలా మార్కెట్ కమిటీల్లో ఈ నిధులను విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. నాసిరకం పనులు చేయడం వల్ల కొద్ది నెలలకే ఈ పనుల్లో చోటు చేసుకున్న అక్రమాలు బట్టబయలవుతున్నాయి. కర్నూలు నగరంలో సీ.క్యాంపు రైతుబజారుతో పాటు అమీన్‌అబ్బాస్‌నగర్‌లో ఏర్పాటైన రైతుబజార్లలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి కొద్ది నెలలకే అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. సీ.క్యాంపు రైతుబజారులో రూ.20లక్షలు ఖర్చు పెట్టి కాలువలపై సిమెంటు పలకలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ పలకలు పగిలిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతూ నేలపైనే కూర్చుని వ్యాపారం చేసుకుంటున్నారు. సొంతంగా ఖర్చు చేసి బండలను కాల్వపై ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన టైల్స్ కూడా పగిలిపోయాయి. అదేవిధంగా అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారులో ఏర్పాటు చేసిన టైల్స్‌తో పాటు దుకాణాల వద్ద కూడా వివిధ పనులు నాసిరకంగా నిర్మించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుబజార్లలో రైతుల వసతుల కోసం నాణ్యతతో కూడిన పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



సీ క్యాంపు రైతుబజారులో డ్రైనేజీ కాలువపై ధ్వంసమైన పెంకులు

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన బిపుల్ సైకియా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్ బిపుల్ సైకియా, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: రాయలసీమ యూనివర్సిటీలోని పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి ఇంజనీరింగ్ బ్లాకులోని స్ట్రాంగ్ రూమ్‌ను, కౌంటింగ్ హాల్, కంట్రోల్ రూమ్‌లను ఆదివారం పాణ్యం నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్ బిపుల్ సైకియా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ఉదయం 8 గంటలకే ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీలో వణుకు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీ శ్రేణుల్లో వణుకు పుడుతోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని వైసీపీ పాలన నుంచి విముక్తి కోసం కూటమి వైపు ఓటర్లు మొగ్గు చూపారని ఆయన అన్నారు. ఒక్క అవకాశం అంటూ చేతగాని, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో నూకలు చెల్లాయని విమర్శించారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు కార్మికులు అందరూ జగన్‌కు ఓటుతో తగిన బుద్ధి చెప్పనున్నారని, ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపుతో జగన్ ఇంటికి పోవడం ఖాయమని అన్నారు. జాతీయ మీడియా సంస్థలు రాష్ట్ర సర్వే సంస్థలు చేపట్టిన ఎగ్జిట్ పోల్స్‌తో వైసీపీకి దిమ్మ తిరిగిందని అన్నారు. జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యేల అరాచక పాలన అంతమవుతుందని అన్నారు.

రెండో ర్యాండమైజేషన్ పూర్తి



కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 2: ఈ నెల 4వ తేదీన కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన అబ్జర్వర్లకు వివరించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కాన్ఫరెన్స్ హాల్లో జనరల్ అబ్జర్వర్లు జాఫర్ మీర్‌తారీఖ్ ఆలీ సమక్షంలో కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ టేబుల్స్‌కు అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచుకునేలా రెండో ర్యాండమైజేషన్ చేసినట్లు తెలిపారు. అందులో ఈవీఎం టేబుల్‌పై ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ పోస్టల్ బ్యాలెట్ టేబుల్‌పై ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రో అబ్జర్వర్, అబ్జర్వర్ టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉండేలా కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారని అన్నారు.

కేంద్రంలో మార్షల్స్ ఏర్పాటు: కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏజెంట్లు ఏవైనా అవాంతరాలు కలిగిస్తే నియంత్రించడానికి ప్రతి ఫ్లోర్‌లో సివిల్ డ్రస్‌లో మార్షల్స్‌ను ఏర్పాటు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఫ్లోర్ ఎగ్జిట్ ప్లాన్ తయారు చేయించాలని ఆర్వోలకు సూచించారు. ప్రతి నియోజకవర్గం కౌంటింగ్ హాలు దగ్గర మెడికల్ టీమ్స్ ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌తో రెడీ ఉంచినట్లు తెలిపారు. నియోజకవర్గాల వారిగా కౌంటింగ్ డేటాను అప్‌లోడు చేసే సమయంలో రౌండు వారిగా సమాచారాన్ని మీడియాకు షేర్ చేసేందుకు సమాచార శాఖ అధికారికి కూడా షేర్ చేయాలని ఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ అబ్జర్వర్ బిపుల్ సైకియా పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ కర్నూలు ఆర్వో భార్గవ్‌తేజ, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సి. బెళగల్, జూన్ 2: మండలంలోని పోలకల్లుకు చెందిన ముగ్గురు వ్యక్తులు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర ఉన్న కాలువ దగ్గర అమ్మడానికి సిద్ధంగా ఉంచుకున్న మద్యాన్ని పోలీసులు గుర్తించి దాడి చేశారు. 389 మద్యం ప్యాకెట్లను వదిలి నిందితులు పారిపోయారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. అలాగే చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి గ్రామాల మధ్య పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని 6 మోటార్ సైకిలు, వారి దగ్గర ఉన్న నగదు రూ 8200ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

నందికొట్కూరు, జూన్ 2: నందికొట్కూరు పట్టణంలో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌కు చెందిన షాలుమియా(52) బహిర్భూమికి వెళ్లారని, అదే సమయంలో వైన్ షాప్‌కు సమీపంలో పిడుగు పడడంతో షాలుమియా అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

‘రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత’

కర్నూలు(కల్చరల్), జూన్ 2: రాజ్యాంగ హక్కుల్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సాహితీ, సామాజిక సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల ఉపా చట్టం కింద విడుదలైన ప్రముఖ జర్నలిస్టు, న్యూస్‌క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థ రాసిన ‘అలుపెరుగని పోరాటం’ పుస్తక పరిచయ సభ నిర్వహించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది వై. జయరాజు పుస్తకాన్ని ఆవిష్కరించగా, సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై. జయరాజు మాట్లాడుతూ వామపక్ష ప్రజాతంత్ర, లౌకిక అభ్యుదయ వాదులందరూ ఏకమై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రబీర్ పురకాయస్థ రాసిన పుస్తకం చాలా అవసరమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. విశ్రాంత ఆచార్యుడు ఎస్ మున్నూర్ రెహన్ మాట్లాడుతూ బీజేపీలో ఉన్న ప్రస్తుత పాలకులకు కమ్యూనిస్టులు, క్రైస్తవులు, ముస్లింలు, దళితులు అంటే నచ్చదని అన్నారు. నేడు 320 మంది జర్నలిస్టులు జైల్లో మగ్గుతున్నారని, 2023 మంది రిపోర్టర్లను చార్జిషీటు లేకుండా జైల్లో పెట్టినట్లు తెలిసిందన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను సైతం జైల్లో పెట్టిన ఘనత బీజేపీకి దక్కుతుందని విమర్శించారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ రాజ్యాంగం గురించి మాట్లాడేవాళ్లంటే మోదీకి రుచించదని, మందబలాన్ని అడ్డుపెట్టుకొని ఏదైనా చేయవచ్చనే భావనలో ఉన్నారని చెప్పారు. మతం మత్తును మనుషుల్లో ఎక్కించడం వల్ల బీజేపీ దేశాన్ని మరింతగా భ్రష్టుపట్టిందని అన్నారు. కర్నూలు సివిల్ ఫోరం అధ్యక్షుడు ప్రసాదశర్మ మాట్లాడుతూ సమాచార స్వేచ్ఛ కనుమరుగైందని, ప్రసార సాధనాలన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్నారు. కార్యక్రమంలో నరసింహ తదితరులు మాట్లాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ, సామాజిక సంస్థల ప్రతినిధులు

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

బేతంచెర్ల, జూన్ 2 : బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామానికి చెందిన వడ్ల హరి ప్రసాద్ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు. ఆదివారం సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రుద్రవరం గ్రామానికి చెందిన బానాల హరిప్రసాద్ (38) గత మే నెల 25న అదే గ్రామానికి చెందిన కొత్త గొల్ల వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల వెంకటసుబ్బయ్య, బీసన్నగారి చిన్న మద్దయ్యలు రుద్రవరం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు బాణాల హరిప్రసాద్, వెంకటేశ్వర్లుపై కట్టెలు, రాళ్లు, పిడిబాకుతో దాడి చేశారు. బాణాల హరిప్రసాద్‌ను హత్య చేసి పరారయ్యారు. నిందితులను సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది తిరుపాల్‌నాయక్, దస్తగిరి, గురువాబు, సురేష్ కుమార్, మద్దిలేటి, రాజు నాయక్‌ల సహాయంతో సీతారామాపురం మెట్ట వద్ద ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు.హత్యకు ఉపయోగించిన కట్టె, రాయి, పిడి బాకును స్వాధీనం చేసుకుని నిందితులను డోన్ కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ నిందితులను రిమాండ్‌కు ఆదేశించారు.



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్

ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు అధికారుల నియామకం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న నిర్వహించే పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం, ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు భారత ఎన్నికల సంఘం సీనియర్ అధికారులను పరిశీలకులుగా నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి దినేష్ కుమార్, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గానికి భగవత్ కిషోర్ మిశ్రా, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గానికి అభిజిత్ ముఖర్జీ, నంద్యాలకు రాహుల్ సింగ్, బలనగానపల్లెకు ప్రకాష్ మిశ్రా, డోన్‌కు అమిత్ కుమార్‌లను పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ, ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై సూచనలు చేశామని తెలిపారు.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'బలిజల అభ్యున్నతికి సహకారం'



ప్రతిభా పురస్కారం అందజేస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, జూన్ 2: బలిజల అభ్యున్నతికి సహకరిస్తామని బలిజ, కాపు సేవా సమితి వ్యవస్థాపకులు దండే దస్తగిరి అన్నారు. పట్టణంలోని రావూస్ కళాశాలలో బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో పది ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిబ కనబరిచిన 70 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. దస్తగిరి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జంబులన్న ట్రస్ట్ ద్వారా వర్ధంశెట్టి రాజారాం సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్ని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, పడకండ్ల సుబ్రహ్మణ్యం, సేవా సమితి అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చదువుకు పేదరికం అడ్డు కాదు'



విద్యార్థికి ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న ప్రముఖులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: కష్టపడే విద్యార్థులకు పేదరికం అడ్డుకాదని ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శన శెట్టి అన్నారు. ఆదివారం నంద్యాలలోని సంఘమిత్ర సంస్థలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు వాయిస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి వాయిస్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త గోళ్ళ సుదర్శన శెట్టి, సివిల్ ఇంజనీర్ ప్రమోద్, సంఘమిత్ర ప్రతినిధి సుందరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లాలోని 21 మండలాల నుంచి పదో తరగతి టాపర్లకు ఒక్కొక్కరిని రూ.1100 నగదు, మెమెంటో, మెడల్స్‌తో సత్కరించారు. అతిథులు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే వారి సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని వాయిస్ సంస్థ ప్రతినిధులను కొనియాడారు. విద్యార్థుల లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘమిత్ర కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

కోడి గుడ్ల లారీ బోల్తా



బోల్తా పడిన కోడిగుడ్ల లారీ

గోస్పాడు జూన్ 2: మండలంలోని కానాలపల్లె మెట్ట వద్ద ఆదివారం కోడిగుడ్ల లారీ బోల్తా పడింది. కడప నుంచి నంద్యాలకు వస్తున్న లారీ కానాలపల్లె వద్ద అదుపు తప్పి ఆదివారం తెల్లవారు జామున బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లారీలో ఉన్న కోడి గుడ్లను కానాలపల్లె, దీబగుంట్ల గ్రామాల ప్రజలు తీసుకెళ్లారు.

మురుగు.. ఎప్పటికి తొలగు

● డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
● దోమల వ్యాప్తితో ఆందోళనలో ప్రజలు



మిట్నాల గ్రామంలో మురుగు నిల్వ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: నంద్యాలలోని 33వ వార్డు జ్ఞానాపురంలో డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలోని పూడికలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు అధికారులకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. డ్రైనేజీలో చెత్తా చెదారం పూడుకుపోయి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాకాలంలో మురుగు ఇళ్లలోకి చేరుతోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు అధికం కావడంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామంలో దళిత వాడ మురుగు కుంటలా మారింది. పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా గ్రామంలోని మురుగు వీధుల గుండా ప్రవహిస్తోంది. ఇళ్ల మధ్యలో పారుతున్న మురుకు కారణంగా అనా రోగ్యం ప్రబలే ప్రమాదం ఉందని దళితవాడ ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 70 నివాసాలు మురుగులోనే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



జ్ఞానాపురంలో డ్రైనేజీలో పేరుకుపోయిన మురుగు

నిరుపయోగంగా ప్రభుత్వ కార్యాలయాలు

● అడవిని తలపిస్తున్న పరిసర ప్రాంతాలు



ముళ్లపొదల మధ్య జీబీఎం రేంజ్ కార్యాలయం



తెరిచి ఉన్న కార్యాలయం



నిరుపయోగంగా ఉన్న మరో కార్యాలయం

బండిఆత్మకూరు, జూన్ 2: గుండ్లబ్రహ్మేశ్వరం అటవీ రేంజ్ కార్యాలయం అడవిలా మారిపోయింది. మండలంలోని సంతజూటూరు గ్రామంలో గుండ్లబ్రహ్మేశ్వరం అటవీ రేంజ్ కార్యాలయం ఉంది. ఒకప్పుడు ఇక్కడ సిబ్బందితో కార్యాలయం కళకళలాడేది. ఇక్కడి నుంచి జీబీఎం అభయారణ్యం రేంజ్ దాదాపు 30 కీమీ దూరంలో ఉంటుంది. అక్కడ దట్టమైన అభయారణ్యం ఉంటుంది. బ్రిటీష్ కాలం నాటి నుంచే ఇక్కడ ప్రత్యేక రేంజ్ ఏర్పాటు అయినట్లు సమాచారం. నేడు కార్యాలయం అంతా ముళ్లపొదలతో నిండిపోయింది. ఏకంగా కార్యాలయానికి తాళాలు కూడా వేయకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. కార్యాలయాన్ని పట్టించుకోకపోవటంతో విషపురుగులు సహితం పెరిగినట్లు సమీప కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ కార్యాలయం మీదుగా ఎస్సీ కాలనీకి వెళ్తుంటారు.

కార్యాలయాన్ని మార్చాం

జీబీఎం రేంజ్ కార్యాలయాన్ని సంతజూటూరు నుంచి గాజులపల్లెకు మార్చాం. అక్కడి కార్యాలయం పని చేయటం లేదు. సిబ్బంది ఎవరూ ఉండరు. కార్యాలయాన్ని పూర్తిగా తాళాలు వేసి మూసివేశాం.

- త్రినాథ్‌రెడ్డి ఎఫ్‌ఆర్వో

ఉద్యోగి మృతికి పలువురి నివాళి

పాణ్యం, జూన్ 2: ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ శింగారపు నాగరాజు మృతికి పలువురు నివాళి అర్పించారు. శనివారం డోన్ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు కుటుంబాన్ని ఆదివారం పలువురు పరామర్శించారు. నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో నాగ రాజు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో పాణ్యం ఎంపీపీ ఉశేన్‌బీ, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, గ్రామ నాయకులు, టీడీపీ నాయకులు ఎంపీటీసీ రంగరమేష్, ప్రజలు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు, జూన్ 2: మండలంలోని రేగడ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-2007 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం పాఠశాల ఆవరణ లో నిర్వహించారు. తాము చదువు చెప్పిన పలువురు విద్యార్థులు పలు హోదాల్లో ఉండటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని చదువు చెప్పిన ఉపాధ్యాయులు అన్నారు. పలువురు పలు రంగాల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎవరు ఏ స్థాయికి ఎదిగినా కన్న తల్లిదండ్రులను స్వగ్రామాన్ని చదువుకున్న పాఠశాలను మరువకూడదన్నారు. చదువుతోనే ఏదైనా సాధించవచ్చని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. చాలా సంవత్సరాల తర్వాత ఈ విధంగా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. చదువు చెప్పిన గురువులకు ఘనంగా సన్మానించారు. అనంతరం తాము చదువున్న పాఠశాలలో కలియ తిరిగి గత స్మృతులను నెమరువేసుకున్నారు.

'కౌంటింగ్ ప్రక్రియకు విఘాతం కలిగిస్తే చర్యలు'

ఆత్మకూరు, జూన్ 2: శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించిన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు వచ్చే ఏజెంట్లు సత్ప్రవర్తన కలిగిన వారుగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి ఎవరూ మద్యం సేవించి రాకూడదని, కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే సమయంలోనే తాము బ్రీత్ ఎనలైజర్ మిషన్ ద్వారా తనిఖీ చేస్తామని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలేవి అనుమతించమని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలే తప్ప గొడవలకు పాల్పడరాదని తెలిపారు. ఒకసారి కౌంటింగ్ హాల్‌లోకి ప్రవేశిస్తే మళ్లీమళ్లీ వచ్చి వెళ్లేందుకు అనుమతించమని చెప్పారు. ఏవరైనా అనారోగ్య ఇబ్బందులు ఉన్నట్లయితే ఇప్పటికైనా ఏజెంట్లుగా ఉండే నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. ఇకపోతే ఫలితాల అనంతరం బాణాసంచా కాల్చడం, సభలు, సంబరాలు చేసుకోవడం వంటివి నిబంధనలకు విరుద్ధమని వివరించారు. అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా అనవసరంగా కౌంటింగ్ సెంటర్ల వద్దకు రాకుండా ఇళ్ల నుంచి టీవీలు, సోషల్ మీడియా ద్వారా కౌంటింగ్ వివరాలను తెలుసుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరు సహకరించాలని కోరారు. ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్ ఉన్నారు.

'శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు'

కొత్తపల్లి, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడుతుండటంతో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో తమ సిబ్బందితో ఆదివారం కవాత నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ కొత్తపల్లి, శివపురం గ్రామాలపై నిఘా ఉంచామన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్‌తో పాటు 30 పోలీసు యాక్టు కూడా అమలులో ఉందన్నారు.

'నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి'



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 2: విద్యా బోధనలో నైతిక విలువలకు ప్రాధాన్యమివ్వాలని రామకృష్ణ విద్యా సంస్థల ఛైర్మన్, సరస్వతి విద్యా పీఠం అనంతపురం సమితి అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. రామకృష్ణ పీజీ కళాశాలలో మే నెల 15వ తేదీ నుంచి జూన్ 2 వరకు జరిగిన ఆచార్య శిక్షణ క్యాంపు ముగింపు సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కర్నూలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఎద్దుల మహేశ్వరరెడ్డి, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు, సరస్వతి విద్యా పీఠం అనంతపురం సమితి అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. 19 రోజుల శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి వారి భవిష్యత్తు ఉన్నత స్థితికి ఎదిగే విధంగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సరస్వతి విద్యా పీఠం, విద్యా భారతి అందిస్తున్న సహకారిన్ని విద్యా పీఠం ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని సూచించారు. దేశ నిర్మాణంలో తమవంతు కృషి చేయాలని చెప్పారు. మాతృభాష సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 160 పాఠశాలల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, సరస్వతి విద్యా పీఠం, విద్యాభారతి సంస్థల ప్రతినిధులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు, జూన్ 2: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఎక్కడి సమస్యలే అక్కడే ఉన్నాయన్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధిదీపాలు, తాగునీటి కుళాయిలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయా కాలనీల్లో డ్రైనేజీ లేకపోవడంతో దోమలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పందులు, కుక్కలు సంచారం అధికంగా ఉందన్నారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంజూరైన నాన్ అమృత్ స్కీం పనులు కూడా ముందుకు సాగలేదని తెలిపారు. నాయకులు రామ్‌నాయక్, స్వాములు, సురేంద్ర, నాగేశ్వరరావు, దినేష్ తదితరులు ఉన్నారు.

శాశ్వత అన్నదాన పథకానికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్ర పటాన్ని అందజేస్తున్న ఏఈవో

శ్రీశైలం, జూన్ 2: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహి స్తున్న శాశ్వత అన్నదాన పథకానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం, సింధనూరుకు చెందిన శర్వారి దేవిరెడ్డి అనే భక్తుడు రూ. 1,11,111 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని దేవ స్థానం సహాయ కార్యనిర్వహణా ధికారి ఫణిధర్ ప్రసాద్‌కు అందజేశారు. దేవస్థానం అధికారులు భక్తుడికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు శర్వానంద్



శ్రీశైలంలో శర్వానంద్

శ్రీశైలం, జూన్ 2: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ప్రముఖ సినీ నటుడు శర్వానంద్ దర్శించుకున్నారు. ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని అనంతరం భ్రమరాంబి కాదేవికి కుంకుమార్చన చేశారు. దర్శనానంతరం ఆయన అభిమానులతో సందడి చేశారు.

మద్యం కోసం క్యూ



ఆత్మకూరులో..



వెలుగోడులో మద్యం దుకాణం వద్ద క్యూలో ఉన్న మద్యంప్రియులు

ఆత్మకూరు, జూన్ 2: సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేయనుండటంతో మద్యం ప్రియులు ఆదివారం నుంచే మద్యాన్ని కొనుగోలు చేసేందుకు మద్యం దుకాణాల వద్ద బారులుతీరారు. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలో మొత్తం 3 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా అన్ని దుకాణాలు మద్యంప్రియులతో కిటకిటలాడాయి. అయితే ఎన్నికల ఫలితాల రోజున పూర్తిస్థాయిలో మద్యం దుకాణాలు అందుబాటులో ఉండవన్న కారణంతోనే రెండు రోజుల ముందు నుంచే మద్యంప్రియులు మద్యాన్ని కొనుగోలు నిల్వ చేసుకుంటున్నారు.

వెలుగోడు: ఎన్నికల లెక్కింపును పురస్కరించుకుని రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్ చేయనుండటంతో ఆదివారం మద్యం కోసం మద్యం ప్రియులు దుకాణాల వద్ద బారులు తీరారు. దుకాణాలు మూత పడతాయన్న ఆలోచనతో మద్యం కోసం ఎన్నో అగచాట్లు పడి మద్యం కొనుగోలు చేశారు. మరో వైపు నగదు లావాదేవీలు లేకుండా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారానే కొనుగోలు చేయాలన్న నిబంధనలతో విక్రయాలు ఆలస్యంగా జరుగుతున్నాయి. మరో వైపు ఈనెల 3,4,5 మద్యం విక్రయాలు బంద్ అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మద్యం కొనుగోలుకు డిమాండ్ పెరిగింది.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకిలో స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, జూన్ 2: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ నరసింహస్వామి మ్యూజికల్ డాన్స్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణపతి ప్రార్థన, మూషికవాహన, శివతాండవం, శివాష్టకం, బిల్వాష్టకం, లింగాష్టకం, శంకరాశశిధరా తదితర గీతాలకు గాయత్రి, సాయివిధాత్రి, సునంద, భువనేశ్వరి, తన్మయిశ్రీ, స్వాతి, సురభి, స్వాతినాగలక్ష్మి, గీతావాణి, పల్లవి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితులు

కొత్తపల్లి, జూన్ 2: మండలంలోని నల్లమల్ల అరణ్యంలో కొలువైన కొలనుభారతి అమ్మవారి క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్థులతో పాటు విద్యార్థులకు కూడా సెలవులు ముగుస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, నూతన వస్త్రాలభిషేకించి విశేష పూజలు గావించి పూజాదిక్రతవులు నిర్వహించారు. భక్తులు తమ చిన్నారులకు అమ్మవారి సన్నిధానంలో అక్షరాభ్యాస క్రతువులు చేయించిన అనంతరం సరస్వతి దేవి అమ్మవారిని, సప్తశివాలయాలను దర్శించుకుని తరించారు. ఈ సందర్భంగా ఈవో మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు సెలవులు ముగుస్తుండటంతో గత వారం రోజులుగా అమ్మవారి సన్నిధి క్షేత్రానికి భక్తుల తాకిడి అధికమైనట్లు చెప్పారు. ఆదివారం 22 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకున్నట్లు తెలిపారు. విచ్చేసిన భక్తాదులకు స్థానిక ఆర్యవైశ్య నిర్వాహకులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కొత్తూరులో నూజివీడు న్యాయాధికారి పూజలు



న్యాయాధికారికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, జూన్ 2: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కృష్ణా జిల్లా నూజివీడు అదనపు న్యాయాధికారి శైలజ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో న్యాయాధికారిని ఘనంగా సత్కరించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మహానందిలో ఐఆర్ఎస్ అధికారి



మహానందిలో ఐఆర్ఎస్ అధికారి భగవత్ కిషోర్ మిశ్రా

మహానంది, జూన్ 2: మహానంది క్షేత్రంలో ఐఆర్ఎస్ అధికారి, శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎలక్షన్ అబ్జర్వర్ భగవత్ కిషోర్ మీశ్రా దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఆలయం చేరుకొన్న వీరికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. పూజల అనంతరం వీరిని ఆలయం ప్రాంగణంలోని అలంకార మంటపంలో వేదపండితులు వీరిని శాల్వతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

7,8,9 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోండి

అవుకు, జూన్ 2: అవుకు పట్టణంలోని ఏపీమోడల్ స్కూల్ 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమీమా ఆదివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెలా 8వ తేదీ వరకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు 9న జరిగే ప్రవేశపరీక్షకు హాజరు కావాలన్నారు. అలాగే ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం సెలక్షన్ ఫలితాలు విడుదల చేశామన్నారు. మెరిట్ కం రోస్టర్ ఆధారంగా గ్రూపుకు 40 సీట్ల చొప్పున నాలుగు గ్రూపుల్లో 160 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. సెలక్షన్ లిస్ట్ స్కూల్ నోటీస్ బోర్డుపై ఉంచామన్నారు. సెలక్ట్ అయిన విద్యార్థులు కాలేజీలో చేరవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు

అవుకు, జూన్ 2: అవుకు మండలంలోని గ్రామాల ప్రజలు అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ కిరణ్ బాబు ఆదివారం హెచ్చరించారు. ఎస్ఐ మాట్లాడుతూ 4న కౌంటింగ్ ఉన్నందున మెడికల్ ,అత్యవసర పనులు ఉంటేతప్ప పక్క గ్రామాల ప్రజలు అవుకు పట్టణంలోకి రావద్దన్నారు. మండలంలోని అన్ని గ్రామాలల్లో 144 సెక్షన్‌తో పాటు ,30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉందన్నారు. ర్యాలీలు ఊరేగింపులో బాణాసంచా కాల్చటం, డీజేలు పెట్టడం, డ్రమ్ములు కొట్టడం చేయరాదన్నారు. గెలిచిన పార్టీకి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఓడిపోయిన పార్టీవారిని రెచ్చగొట్టడం కదింపు చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాయామ అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం


సౌలు రాజు(ఫైల్)

శిరివెళ్ల, జూన్ 2: మండలంలోని యర్రగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సౌలురాజు అనారోగ్యంతో మృతి చెందినట్లు హెచ్‌ఎం విజయ్ కుమార్ ఆదివారం తెలిపారు. యర్రగుంట్ల పీడీగా పని చేసి ప్రస్తుతం పాణ్యం మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సుబ్రమణ్యం సహకారంతో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు దాదాపు రూ.50 వేలు, పీడీ రవికుమార్ రూ.30 వేలు, యర్రగుంట్ల పాఠశాల బృందం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సౌలురాజు కుటుంబసభ్యులకు అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

వైభవంగా పవిత్రోత్సవం


లలిత సహస్ర నామ పారాయణం చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 2: చాగలమర్రి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలోగల హనుమాన్ ఆలయంలో ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణం చేశారు. అంజనేయస్వామి వ్రతాన్ని చేపట్టారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వరుణ దేవుడు కరుణించాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెద్దమ్మకు పూజలు

చాగలమర్రి గ్రామంలోని పెద్దమ్మ, చాగలమ్మ, గంగమ్మ ఆలయాల్లో ఆదివారం వైశాకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు పెద్దమ్మకు, గంగమ్మకు బోనాలు సమర్పించారు. వరుణ దేవుడు కరుణించాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి'

చాగలమర్రి, జూన్ 2: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని అభినవ శంకరానందస్వామి అన్నారు. ఆదివారం చాగలమర్రి శివ రామానంద ఆశ్రమంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హిందువులు హిందూ సంప్రదాయాన్ని గౌరవించాలని సూచించారు. ధర్మప్రచారం అందరి బాధ్యత అన్నారు. ధ్యానం, ఆధ్యాత్మిక చింతన కలిగి దైవమార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూన్ 2: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టీబీ నివారణ కోసం ప్రత్యేకంగా బీసీజీ టీకాలు వేస్తున్నామని, 18 నుంచి 60 ఏళ్ల పైబడిన వారు టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. 600 మందికి బీసీజీ టీకాలు వేశామన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య చికిత్సలు చేయించాలని అన్నారు. బీసీజీ టీకాపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి ఉన్నారు.

'అటవీ సంరక్షణ అందరి బాధ్యత'

చాగలమర్రి, జూన్ 2: అడవులను సంరక్షించుకోవడం అందరి బాధ్యతని డి.వనిపెంట సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులునాయుడు అన్నారు. చాగలమర్రి అటవీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. అడవికి నిప్పు పెటినా, వన్యప్రాణులను వేటాడిన, వృక్షాలను నరికినా చర్యలు తప్పవని హెచ్చరించారు. చెట్లను నరకడం వల్ల వృక్ష సంపద తగ్గిపోయి వాతావరణ సమతుల్యత లేక అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా నాటి పెంచాలన్నారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

చాగలమర్రి, జూన్ 2: గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 4న జరిగే కౌంటింగ్ సమయంలో గెలుపు సంబరాలు, బాణసంచా కాల్చడం చేయకూడదని అన్నారు. ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో గ్రామాల్లో గుంపులు గుంపులుగా ఉండరాదని, 144 సెక్షన్, 30 యాక్ట్ అమలులో ఉంటుందని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైన సహించేది లేదని అన్నారు.

పెద్దమ్మ ఆలయంలో విశేష పూజలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో వెలసిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్లలో వెలసిన చౌడేశ్వరి మాతకు భక్తులు పూజలు నిర్వహించారు.

బీసీజీ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలి

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: మండలంలోని వివిధ గ్రామాల్లో 60ఏళ్ల పైబడిన టీబీ వ్యాధి రోగులు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలని కొలిమిగుండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డా. హరిచరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు మొత్తం 520 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు. గతంలో టీబీ సోకిన షుగర్ వ్యాధి రోగులు, పొగ తాగడం అలవాటు వున్న వారు, బాడీ మాస్ ఇండెక్స్ 18కన్నా తక్కువగా వున్న వ్యక్తులు టీకా వేయించుకోవాలని డాక్టర్ సూచించారు. టీబీ నివారణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఆగిన అంగన్‌వాడీ భవనం పనులు

● అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలు


శెట్టివీడులో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

చాగలమర్రి, జూన్ 2: మండలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచి పోయాయి. ఏడేళ్ల గడుస్తున్నా భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. టీడీపీ హయాంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. శెట్టివీడు, జ్ఞానాపురం గ్రామాల్లో భవన పనులు ప్రారంభించారు. ఒక్కో భవనానికి రూ.7.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో స్లాబ్ వరకు పనులు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు రాక పనులు నిలిచి పోయాయి. భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. శెట్టివీడు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పశుగ్రాసం వేశారు. గొడిగనూరు గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. వెచ్చించిన నిధులు దుర్వినియోగం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. జ్ఞానాపురం గ్రామంలో స్లాబ్ వరకు వేసి వదిలేశారు. అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలతో చిన్నారులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం చెల్లించే అద్దె కూడా సరిపోకపోవడంతో వర్కర్లు చేతి నుంచి చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగిన భవనాలకు బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు పలు మార్లు కోరిన ఫలితం లేకపోయింది. దీనిపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలను వివరణ కోరగా బిల్లులు నిలిచిపోవడం వల్లే భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని చెప్పారు. ఆగిన భవనాల పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

కొండమనాయిని పల్లెలో ఎస్పీ పర్యటన


కొండమనాయిని పల్లెలో పోలీస్ పికెట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

అవుకు, జూన్ 2: అవుకు మండలం కొండమనాయిని పల్లెలో ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదివారం పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అవుకు మండలంలో కొండమనాయిని పల్లెలో అత్యంత సమస్యాత్మక గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఉందన్నారు. మంగళవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో అసాంఘిక ఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పికెట్‌లోని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. యువత క్షణికావేశాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కౌంటింగ్ రోజున ప్రజలు అత్యవసర సమయాలలోనే బయటకు రావలన్నారు. నలుగురు వ్యక్తులకు మించి గుమిగూడ వద్దన్నారు. ఎవరైన సరే నిబంధనలకు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ హరినాథ్ రెడ్డి, సీఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబు పాల్గొన్నారు.

డోన్‌లో పోలీసుల పికెట్

డోన్(రూరల్), జూన్ 2: డోన్ పట్టణంలో సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల పికెట్ ఏర్పాటు చేశారు. టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నివాసాల వద్ద, టీడీపీ, వైసీపీ కార్యాలయాల వద్ద సాయి ఫంక్షన్ సర్కిల్ ప్రాంతం, పాతబస్టాండు ప్రాంతాల్లో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే కంబలపాడు సర్కిల్ రోడ్డులో పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మంగళవారం కౌంటింగ్ ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

144 సెక్షన్ అమలులో ఉంటుంది: సీఐ

బేతంచెర్ల, జూన్ 2: మండలంలో ఎన్నికల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉన్నందున ఆయా గ్రామాల్లో పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎలాంటి ఘర్షణలకు పాల్పడినా అలాంటి వారిపై చర్యలు తప్పవని సీఐ ప్రియతమ్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 144 సెక్షన్ ఉంటుందని, గుంపులు గుంపులుగా ఉండరాదని, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారాదన్నారు. అలాగే బాణాసంచాలు కాల్చడం చేయరాదన్నారు. డీజేలు, డ్రమ్స్‌లు వాయించడం చేయరాదన్నారు. ఎవరైనా రెచ్చగొట్టే కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

కోవెలకుంట్ల, జూన్ 2: అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. జమ్మలమడుగు నుంచి కోవెలకుంట్లకు శేఖర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుకలోడ్‌తో అక్రమంగా తరలిస్తుండగా కోవెలకుంట్ల పట్టణ సమీపంలో ఇసుక ట్రాక్టర్ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్ శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డోన్‌లో టీడీపీ గెలుపు ఖాయం

డోన్(రూరల్), జూన్ 2: డోన్‌లో టీడీపీ గెలుపు ఖాయమని డోన్ టీడీపీ నాయకులు సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ఫలితాల రోజున రాష్ట్రంలో టీడీపీ కూటమి ఏర్పాటు కానుందన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు టీడీపీ కూటమిని గెలిపించనున్నారనీ అన్నారు. రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఆయన తెలిపారు.

పది విద్యార్థినులకు అభినందన


పది విద్యార్థినులకు జ్ఞాపికలను అందజేస్తున్న వాయిస్ ఓవర్ సంస్థ సభ్యులు

చాగలమర్రి, జూన్ 2: చాగలమర్రిలోని జడ్పీ ఓరియంటల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన పది విద్యార్థిని మోమిన్ పది పరీక్షల్లో 581 మార్కులు సాధించడంతో ఆదివారం నంద్యాలకు చెందిన సంఘ మిత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో వాయిస్ ఓవర్ సంస్థ సభ్యులు సన్మానించి జ్ఞాపికను బహూకరించారని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాల స్థాయిలో 551 మార్కులతో ద్వితీయ స్థానంలో రాణించిన నూరున్నిసాను సన్మానించి మెమెంటోను అందజేశారు. జిల్లా పరిషత్ ఒరియంటల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులను అభినందించి ఉన్నత స్థాయిలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పూల మాబాషా, ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఆళ్లగడ్డ, జూన్ 2: వాహనదారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఎలాంటివి దొరకపోగా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించా. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5 కోట్లకుపైనే బెట్టింగులు

డోన్, జూన్ 2 : డోన్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.5 కోట్లపైనే బెట్టింగులు నడిచినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రంలోనే డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. టీడీపీ కూటమి అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పోటీ చేయగా.. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బరిలో నిలిచారు. దీంతో డోన్ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారన్నదానిపై జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. ఎమ్మెల్యే గెలుపుపై కొందరు టీడీపీ నాయకులు రూ.30 లక్షలపైనే బెట్టింగ్ పెట్టినట్లు తెలిసింది. అదేవిధంగా మరో టీడీపీ నాయకుడు మరో రూ.10లక్షలు బెట్టింగ్ కాసినట్లు తెలిసింది. కొందరు వైసీపీ నాయకులు బుగ్గన గెలుస్తారని రూ.లక్షకు రూ.2 లక్షలు ఇచ్చేలా రూ.30 లక్షలు బెట్టింగ్ పెట్టినట్లు ప్రచారం. ఇలా నియోజకవర్గంలో ఎమ్మెల్యే గెలుపుపైనే రూ.2 కోట్లకు పైగానే బెట్టింగ్ నడిచినట్లు సమాచారం. టీడీపీ ప్రభుత్వం వస్తుందని రూ.లక్షన్నర ఇస్తామని కొందరు టీడీపీ నాయకులు బెట్టింగులతో ఆఫర్ చేస్తున్నారు. ఇప్పటికే రూ.కోటి వరకు బెట్టింగులు నడిచినట్లు తెలిసింది. డోన్ రూరల్‌లో ఏ పార్టీకీ మెజారిటీ వస్తుందన్నదానిపై భారీ బెట్టింగులు నడుస్తున్నాయి. టీడీపీ, వైసీపీ నాయకులు రూరల్ మెజారిటీపై పెద్ద మొత్తంలో బెట్టింగులు వేసినట్లు తెలిసింది. ఇరుపార్టీ నాయకులు రూరల్ మెజారిటీపై రూ.కోటి వరకు పైగానే బెట్టింగులు వేసినట్లు సమాచారం.

కోవెలకుంట్లలో వర్షం



కోవెలకుంట్ల, జూన్ 2: కోవెలకుంట్లలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగైదు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుంచి బయటికి వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటే అవకాశం ఉంది. మంగళవారం ఈ ఉష్ణోగ్రత ఉంటుందని అధికారులు తెలిపారు. పట్టణంలో ప్రజలు ఎండవేడిమికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కసారిగా ఆదివారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 2: మండలంలోని యల్లావత్తుల, రుద్రవరం, కొండమాయపల్లె, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మారెమ్మ, పెద్దమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ


యల్లావత్తులలో మాట్లాడుతున్న డీఎస్పీ కుమారస్వామి

రుద్రవరం, జూన్ 2: ఎన్నికల ఫలితాల రోజున అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎస్పీ కుమారస్వామి హెచ్చరించారు. మండలంలోని కోటకొండ, యల్లావత్తుల, డి.కొట్టాల, శ్రీరంగాపురం, పెద్దకంబలూరు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాల రోజు అల్లర్లకు పాల్పడినా, టపాకులు కాల్చి గెలుపు సంబరాలు చేసుకున్నా కేసులు నమోదు చేస్తమని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంతంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రవాగు దుర్గంధం

● మురికి కూపంగా మారుతున్నతీరు

● ఇళ్లలో చెత్తంతా కాలువలోనే

● బ్రిడ్జి దాటాలంటే ముక్కు మూసుకోవాల్సిందే ..!


చెత్తతో నిండిపోయిన కాలువ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 2: కొలిమిగుడ్లలోని ఎర్రవాగు కాలువ చాలా రోజులుగా కంపు కొడుతోంది. పాలకుల నిర్లక్ష్యం .. అధికారుల అలసత్వం కారణంగా ఎర్రవాగు చెత్తతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఎర్రవాగుకు అటువైపు ఏస్సీ కాలనీ, ఇటు వైపు బీసీ కాలనీల్లో ప్రజలు నివసిస్తున్నారు. పంచాయతీ అధికారులు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ప్రజలు ఇళ్లలోని చెత్తంతా ఎర్రవాగులో పడేస్తున్నారు. దీంతో ఎర్రవాగు మురికి కూపంగా మారి తీవ్ర దుర్వాసన వస్తోంది. దీంతో ఆయా కాలనీల్లో నివాసం వుంటున్న సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్లలోకి దుర్వాసన వస్తోందని, బయట తిరగాలంటేనే ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు వివిధ అవసరాల నిమిత్తం ఏస్సీ కాలనీ ప్రజలు నిత్యం ఎర్రవాగు బ్రిడ్జి దాటి పట్టణంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బ్రిడ్జిపై నడవాలంటే ముక్కు మూసుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి, దుర్వాసన కారణంగా దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఏస్సీ, బీసీ కాలనీలకు చెందిన ప్రజలు ఆవేదన చెందున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని ఎర్రవాగును బాగు చేయాలని కోరుతున్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: ఎస్ఐ

బనగానపల్లె, జూన్ 2: బనగానపల్లె మండలం ఫ్యాక్షన్ గ్రామమైన రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఇరువర్గాలకు ఆదివారం నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నందివర్గం ఎస్ఐ తిరుపాలు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరూ ఘర్షణలకు పాల్పడరాదని అన్నారు. ఇరువర్గాల వారు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే శాంతియుతంగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

ముళ్లపొదలతో మూసుకుపోయిన ఎత్తిపోతల పథకం



అవుకు, జూన్ 2: సంగపట్నం ఎత్తిపోతల పథకం ముళ్ల పొదలతో మూసుకుపోయింది. అవుకు గాలేరునగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) హెడ్ రెగ్యులేటర్ సమీపంలో ఎత్తిపోతల పథకం భవనాన్ని నిర్మించారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి చొరవ తీసుకొని రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశారు. సంగపట్నం కోటా వారి చెరువుకు నీరు చేరాలంటే ఈ ఎత్తిపోతల పథకమే ప్రధాన ఆధారం సంగపట్నం చెరువు కింద 255 ఎకరాలు సాగవుతుంది. అవుకు రిజర్వాయరులో 1.85 టీఎంసీలు (219.5 మీటర్లు) నీరు చేరితే ఎత్తిపోతల పథకం ద్వారా సంగపట్నం చెరువును నింపుతారు. వైసీపీ 5 ఏళ్లపాలనలో ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. లోపలికి వెళ్లే ప్రధాన ద్వారం, ట్రాన్స్‌ఫార్మర్, మిషన్‌లను ఏర్పాటు చేసిన భవనం పూర్తిగా ముళ్ల పొదలతో మూసుకుపోయింది. లోనికి వెళ్లే పరిస్థితి లేదు. రిజర్వాయరుకు నీరు వస్తే ఎత్తిపోతల పథకం మిషన్‌లు పనిచేస్తాయో లేదో చూడాలి. సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల పొదలను తొలగించి మిషనరీలకు మరమ్మతులు చేపట్టాలని సంగపట్నం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆగిన సచివాలయ పనులు

ఐదేళ్లైనా పూర్తికాని భవనం పనులు

నిధుల గ్రహణంతో ముందుకు సాగని వైనం


శెట్టివీడులో ఆగిన సచివాలయం భవన పనులు

చాగలమర్రి, జూన్ 2: చాగలమర్రి, జూన్ 2: మండలంలోని గొడిగనూరు, శెట్టివీడు, పెద్దవంగలి, మల్లేవేముల, చిన్నవంగలి గ్రామాల్లో సచివాలయ భవన పనులు ఆగిపోయాయి. భవన నిర్మాణాలకు పిల్లర్లు వేసి పనులు చేయకుండా వదిలేశారు. ఐదేళ్ల గడిచినా సచివాలయ పనులు అసంపూర్తిగా ఉండటంతో సంబంధిత శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. భవన నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో నిధులు చెల్లించక పోవడంతో పనులు మధ్యలోనే నిలిపి వేశారు. శెట్టివీడు, గొడిగనూరు గ్రామాల్లో పిల్లర్లు వేసి పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సచివాలయాలు నిర్మిస్తామంటూ ప్రచార ఆర్బాటాలు తప్పా పనులు ముందుకు సాగలేదన్న విమర్శలు ఉన్నాయి. ముందుగా పెట్టుబడి పెట్టి నిర్మాణ పనులు చేపట్టిన పలువురు కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.

వాల్మీకి గుహలను సందర్శించిన ఐఏఎస్ అధికారి


వాల్మీకి గుహలను సందర్శించిన అధికారి

ప్యాపిలి, మే 2: మండలంలోని వాల్మీకి గుహలను ఆదివారం ఎన్నికల కౌంటింగ్ పరిశీలన అధికారి దినేష్‌కుమార్ సందర్శించారు. గుహలు అద్భుతంగా ఉన్నాయని ఆయన కొనియాడారు. ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యు సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడిని పరామర్శిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, లింగారెడ్డి

ప్యాపిలి, జూన్ 2 : అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతున్న మండలంలోని కామగానిగుంట్ల గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బాలుకు ప్యాపిలి మండలంలో చిన్నపూదిళ్ల గ్రామానికి చెందిన తూర్పు లింగారెడ్డి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాదులో చికిత్స పొందుతున్న బాలును ఆదివారం మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డితో కలిసి లింగారెడ్డి నగదును అందజేశారు. సాయం చేయడం పట్ల బాధితుడు సంతోషం వ్యక్తం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

● కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకు


మందలూరులో కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకు

రుద్రవరం, జూన్ 2: మండలంలోని మందలూరు గ్రామంలో వాటర్ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ వాటర్ ట్యాంకు ప్రాథమిక పాఠశాల వెనుక భాగంలో ఉంది. వాటర్‌ట్యాంకు పిల్లర్లకు ఇనుపకడ్డీలు బయట పడి ఉన్నాయి. ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు. అధికారులు చర్యలు తీసుకుని ట్యాంకును కూల్చేయాలని స్థానికులు కోరారు.

భగవద్గీత త్రైత్త సిద్ధాంతంపై అవగాహన

ఓర్వకల్లు, జూన్ 2: మండలంలోని ఉప్పలపాడు, కాల్వబుగ్గ గ్రామాల్లో త్రైత్త సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మిడుతూరు కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో శనివారం ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి త్రైత్త సిద్ధాంత భగవద్గీత ప్రవచనాలు చేశారు. భగవద్గీతలోని 16, 17 శ్లోకాల్లో పురుషోత్తముడు అని పరమాత్మ గురించి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామచంద్రుడు, శ్రీనివాసులు, రాఘవేంద్ర పాల్గొన్నారు.